

మాతృభూమికి సేవ చేయండి...

● తమిళ సంఘాల భేటీలో స్టాలిన్

తమిళ సంప్రదాయాన్ని కాపాడండి

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చికాగోకు చెందిన తమిళ సంఘాల ప్రతినిధులతో కలుసుకోవటం సంతోషంగా ఉందని, ఈ సంఘాలన్నీ తమిళ ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని, తమిళ సంప్రదాయాన్ని మరువకూడదని, మాతృభూమికి తమ వంతు సేవచేయాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం అమెరికాలో పర్యటిస్తూ చికాగో నగరంలో బసచేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో ఆ నగరానికి చెందిన వివిధ తమిళ సంఘాల నేతలు, ప్రతినిధులు భేటీ అయ్యారు. చికాగో పర్యటన విజయవంతం కావాలని, తమిళనాడుకు భారీగా పెట్టుబడులు లభించాలని ఆకాంక్షిస్తున్నట్లు తమిళ సంఘాల నేతలు స్టాలిన్‌కు తెలిపారు. ఆ సందర్భంగా స్టాలిన్‌ను ఆయన సతీమణి దుర్గాస్టాలిన్‌ను సత్కరించారు. తమిళనాడు ఫౌండేషన్, ది ఫెడరేషన్ ఆఫ్ తమిళ్ సంగమ్స్ ఆఫ్ నార్త్ అమెరికా (ఫెట్నా), చికాగో తమిళ్ సంఘం, అరమ్ చికాగో, లేక్ కంట్రీ తమిళ్ అసోసియేషన్, అగరం తమిళ్ అకాడమీ, అన్నై తమిళ్ అకాడమీ, సెయింట్ లూయిస్ తమిళ్ సంఘం, ఇండియా తమిళ్ సంఘం, గ్రేటర్ మిల్‌వాకీ తమిళ్ సంఘం, మెక్లీన్ కంట్రీ తమిళ్ సంఘం, మిచిగాన్ తమిళ్ సంఘం, లోవా తమిళ్ సంఘం, నార్త్ ఈస్ట్రన్ విస్కాన్సిన్ తమిళ్ సంఘం, మిన్నిసోటా తమిళ్ సంఘం, తెన్నిసీ తమిళ్‌సంఘం, కెన్‌టుకీ తమిళ్ సంఘం, అమెరికన్ తమిళ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్, గ్లోబల్ అవర్ టీమ్స్ అసోసియేషన్, తమిళ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్స్ కౌన్సిల్ (టీటీఈసీ), ఎఁచ్చి అమెరికన్ అసోసియేషన్, కొలంబస్ తమిళ్ సంఘం, కన్సాస్ తమిళ్ సంఘం, నార్త్‌ఈస్ట్ ఓహియో తమిళ్ సంఘం, పియోరియా తమిళ్ సంఘం, డేటాన్ తమిళ్ సంఘం, ది అమెరికన్ తమిళ్ మెడికల్ అసోసియేషన్ (ఆత్మా), అమెరికన్ తమిళ్ స్కూల్స్ అసోసియేషన్, గ్రేటర్ సిన్సినాటి తమిళ్ సంఘం, క్వాడ్ సిటీ తమిళ్ సంఘం నాయకులు, ప్రతినిధులు ఒకే సమయంలో సీఎం దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రవాస తమిళుల సంక్షేమ బోర్డు చైర్మన్ కార్తికేయ సేనాపతి తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



చికాగో తమిళ సంఘాల నేతలు, ప్రతినిధులతో సీఎం స్టాలిన్ దంపతులు, మంత్రి టీఆర్‌బీ రాజా

నిధులు అడ్డుకోవడమే కేంద్రం లక్ష్యమా?: సీఎం

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బీజేపీయేతర రాష్ట్రాలకు నిధులు నిలిపివేయడమే లక్ష్యంగా పెట్టుకుందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మండిపడ్డారు. విద్యను భ్రష్టుపట్టించేలా కేంద్రం రూపొందించిన విద్యావిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నమనే సాకుతో రాష్ట్రానికి విద్యాపరమైన నిధులను కూడా నిలిపివేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రకటనలో విద్య, వైద్య, ఆర్థిక రంగాల్లో తమిళనాడు ముందంజలో ఉందని కితాబిచ్చి, అదే సమయంలో నిధులను నిలిపివేయడం ఎన్డీయే ద్వంద్వ వైఖరికి నిదర్శనమని స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా రాష్ట్రానికి కేంద్రం నిధులను నిలిపివేసిన విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళుతున్నామని, ఈ విషయంలో వారిదే తుది తీర్పు అని పేర్కొన్నారు.



హెలికాప్టర్ వద్ద పోలీసు అధికారి కాపలా

సాంకేతిక లోపంతో

పొలంలో దిగిన హెలికాప్టర్

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారత వైమానిక దళానికి చెందిన ఓ హెలికాప్టర్ సాంకేతిక లోపం కారణంగా కాంచీపురం జిల్లా సాలవాక్కం సమీపం పోర్‌పందల్ గ్రామంలోని పొలంలో సోమవారం ఉదయం అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. స్థానికులు పొలంలో ఉన్న హెలికాప్టర్‌ను చూసేందుకు పరుగులుతీసారు. ఆ లోగా హెలికాప్టర్‌లో నుంచి దిగిన సైనికులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే మరో హెలికాప్టర్‌లో సాంకేతిక నిపుణులను ఆ ప్రాంతానికి పంపారు. రెండో హెలికాప్టర్ కూడా అక్కడే దిగింది. అందులో వచ్చిన సాంకేతిక నిపుణులు హెలికాప్టర్‌కు మరమ్మతులు చేయడంతో ఆ రెండు హెలికాప్టర్లు వెళ్లిపోయాయి.. ఆ హెలికాప్టర్లను చూడటానికి ఆ ప్రాంతానికి చెందిన పాఠశాల విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో గుమికూడారు.

రిటర్న్ జర్నీ ఎఫెక్ట్...

సొంతూళ్ల నుంచి నగరానికి జనం

● పలుచోట్ల ట్రాఫిక్ జామ్



పరనూరు టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి జరుపుకునేందుకు నగరం నుంచి స్వస్థలాలకు వెళ్ళిన ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, కార్మికులంతా పండుగ తర్వాత తిరిగి రావటంతో సోమవారం నగరం నలుమూలలా ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. ఆదివారం సాయంత్రం నుండే నగరానికి వస్తున్న వాహనాల సంఖ్య క్రమంగా అధికమవుతూ వచ్చింది. చవితి సెలవుల తర్వాత సొంతూళ్లకు వెళ్ళినవారంతా రాష్ట్ర రవాణా సంస్థ, ఆమ్నీ బస్సులు, కార్లు, వ్యాన్లలో నగరానికి బయల్దేరారు. దీంతో పరనూరు టోల్‌గేట్‌కు ఇరువైపులా సోమవారం ఉదయం సుమారు రెండు వందలకు పైగా వాహనాలు బారులు తీరాయి. చెంగల్పట్టు ఎస్పీ సాయి ప్రణీత్ ఉత్తర్వు మేరకు చెంగల్పట్టు డీఎస్పీ పుగళ్, తాలూకా సీఐ నటరాజ్, సుమారు 50 మంది కానిస్టేబుళ్లు ఆ టోల్‌గేట్ దగ్గరకు హుటాహుటిన వెళ్ళి వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ఉదయం 8.30 గంటలకు సింగపెరుమాళ్ కోవిల్ నుంచి పరనూరు టోల్‌గేట్ వరకు నాలుగు కిలోమీటర్లపొడవునా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇదే విధంగా పూందమల్లి, తాంబరం, ఆవడి, అంబత్తూరు తదితర ప్రాంతాల్లో సోమవారం వాహనాల రద్దీ అధికమైంది. పూందమల్లి నుండి కోయంబేడు దాకా సోమవారం ఉదయం వాహనాలన్నీ నత్తనడక నడిచాయి. ట్రాఫిక్ సమస్యల కారణంగా చాలామంది ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, కళాశాల విద్యార్థులు, వ్యాపారులు, కార్మికులు సకాలంలో తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోయారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం



కోయంబత్తూరులో సోమవారం జరిగిన రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 44వ స్నాతకోత్సవంలో ఛాన్సలర్ హోదాలో విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

గుట్కా అవినీతి కేసు

● కోర్టులో మాజీ మంత్రుల సహా 25 మంది హాజరు






కోర్టుకు హాజరైన మాజీ డీజీపీ టీకే రాజేంద్రన్ , చెన్నై మాజీ పోలీస్ కమిషనర్ జార్జి, మాజీ మంత్రులు బీవీ రమణ, సి.విజయభాస్కర్

ప్యారీస్, సెప్టెంబరు 9: గుట్కా అవినీతి కేసులో అన్నాడీఎంకేకు చెందిన మాజీ మంత్రులు బీవీ రమణ, సి.విజయభాస్కర్, మాజీ డీజీపీ టీకే రాజేంద్రన్, చెన్నై పోలీసు మాజీ కమిషనర్ జార్జ్ సహా 25 మంది సోమవారం ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరయ్యారు. రాష్ట్రంలో నిబంధనలు అతిక్రమించి మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలు జరుగుతున్నాయని, ఇందుకు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, అధికారులకు ప్రమేయం ఉందని ఫిర్యాదులందడంతో సీబీఐ అధికారులు ఈ కేసు దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. మాధవరావు, శ్రీనివాసరావు, ఉమాశంకర్ గుప్తా, ఆహార భద్రతా శాఖ అధికారి సెంథిల్ మురుగన్, కేంద్ర పోలీసు అధికారి నవనీత కృష్ణ పాండ్యన్, ఆరోగ్య శాఖ అధికారి శివకుమార్ అనేవారిపై కేసు నమోదుచేశారు. ఈ కేసు చార్జ్‌షీటును హార్బర్ నియోజకవర్గంలోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యేలు, ఎంపీలపై దాఖలయ్యే కేసులను విచారించే ప్రత్యేక కోర్టులో సీబీఐ అధికారులు దాఖలుచేశారు.

మాజీ మంత్రులు...

అన్నాడీఎంకే మాజీ మంత్రులు బీవీ రమణ, డా.సి. విజయభాస్కర్, ఎ.శరవణన్, డా.లక్ష్మీనారాయణన్, మురుగన్, చెన్నై పోలీసు మాజీ కమిషనర్ ఎస్.జార్జి, మాజీ డీజీపీ టీకే రాజేంద్రన్ సహా 21 మందిని చార్జిషీటులో ముద్దాయిలుగా చేర్చారు. గత ఆగస్టు 2వ తేది గుట్కా అవినీతి కేసులపై విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంజయ్‌బాబా సమక్షంలో కేసు నమోదుచేసిన ఆరుగురిని విచారణకు హాజరుపరిచారు. వీరితో పాటు కొత్తగా కేసు నమోదుచేసిన మాజీ మంత్రులు, మాజీ డీజీపీ సహా 21 మందికి సమన్లిస్తూ, వారు సెప్టెంబరు 9వ తేదిన హాజరుపరచాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం మాజీ మంత్రులు సహా 25 మంది కోర్టులో హాజరయ్యారు. వారి తరఫున హాజరైన న్యాయవాదుల్లో కొందరు న్యాయమూర్తి వద్ద వకాలత్ దాఖలుచేశారు. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంతమంది తరఫు న్యాయవాదులు హాజరుకాలేదు. దీంతో, వకాలత్ దాఖలుచేయని వారు ఈ నెల 23న దాఖలుచేయాలని, ఆ రోజున మళ్లీ 25 మందిని విచారణకు హాజరుపరచాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

టీవీకే వైపు సెంజి రామచంద్రన్ చూపు?

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి, మాజీ ఎంపి సెంజి రామచంద్రన్ తమిళ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) వైపు చూస్తున్నారు. ఆ పార్టీ కూడా ఎలాగైనా ఆయన్ని చేర్చుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. విక్రవాండిలో తొలి మహానాడుకు సిద్ధమవుతున్న టీవీకే ఇతర పార్టీల్లో సీనియర్ నాయకులను పార్టీలో చేర్చుకునేందుకు పావులు కదుపుతోంది. టీవీకేలో ఇప్పటివరకూ బుస్సీ ఆనంద్ మినహా ప్రజలకు బాగా పరిచయమైన నేతలెవరూ లేరు. విజయ్ అభిమాన సంఘాల జిల్లా విభాగాల నాయకులు కొద్దో గొప్పో ప్రజలతో సంబంధాలు కలిగివున్నారు. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే, డీఎంకే పార్టీలకు చెందిన అనుభవజ్ఞులైన నేతలను పార్టీలో చేర్చుకుని వారికి కీలకమైన పదవులను అప్పగించాలని విజయ్ నిర్ణయించారు. ఆ మేరకు విజయ్ పార్టీ వేసిన తొలి గాలంలో సెంజి రామచంద్రన్ చిక్కుకున్నట్లు తెలుస్తోంది. మూడుసార్లు ఎంపీగా సేవలందించిన సెంజి రామచంద్రన్ యాభైయేళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం టీవీకే అభివృద్ధికి అన్నివిధాల ఉపయోగపడుతుందని విజయ్ భావిస్తున్నారు. ఆ దిశగానే టీవీకే నేతలు కొందరు సెంజి రామచంద్రన్‌తో రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. ఈ నెలాఖరులో మహానాడు జరుగనుండటంతో ఆ లోగా రామచంద్రన్ పార్టీలో చేరితే టీవీకే ప్రిసీడియం చైర్మన్ పదవి ఇచ్చేందుకు కూడా విజయ్ సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అన్నాడీఎంకేలో సెంజి రామచంద్రన్ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్నారని, పార్టీ అధిష్టానం పట్టించుకోవడం లేదని కూడా వార్తలు వస్తుండటంతో ఆయనను పార్టీలో చేర్చుకునేందుకు ఇదే అనువైన సమయమని టీవీకే నేతలు భావిస్తున్నారు. అదే సమయంలో ఈనెలాఖరున జరుగనున్న పార్టీ మహానాడులో సెంజి రామచంద్రన్ పాల్గొని విజయ్ సమక్షంలో టీవీకే సభ్యత్వం స్వీకరిస్తారని కూడా స్వీకరించనున్నట్లు చెబుతున్నారు.

అవన్నీ వదంతులే: ఈపీఎస్



సెంజి రామచంద్రన్

అన్నాడీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి, మాజీ ఎంపీ సెంజి రామచంద్రన్ సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) లో చేరనున్నారన్న వార్తలను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఖండించారు. టీవీకేలో చేరనున్నట్లు సెంజి రామచంద్రన్ ఇప్పటివరకూ తనకెలాంటి సమాచారం ఇవ్వలేదని ఆయన చెప్పారు. సేలంలో సోమవారం మీడియా సమావేశంలో ఈపీఎస్ మాట్లాడుతూ అన్నాడీఎంకే ఓ మహాసముద్రం లాంటిదని, ఈ పార్టీలో వందల సంఖ్యలో నాయకులున్నారని, వారంతా పార్టీకోసం తీవ్రంగా పాటుపడుతుండటంతో పార్టీ ప్రస్తుతం బలపడుతోందని, మూడు దశాబ్దాలపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన పార్టీగా పేరుగడించిందని చెప్పారు. ఇలా పార్టీ ఎదుగుదల చూసి ఓర్వలేక ప్రత్యర్థులు పనిగట్టుకుని ఇలాంటి పుకార్లు పుట్టిస్తున్నారని ఈపీఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మా పార్టీని ఎవ్వరూ పెకలించలేరు

● అన్నాడీఎంకే నేత సునీల్



ఎడప్పాడితో సునీల్

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నుంచి పలువురు సీనియర్లు నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీలో చేరబోతున్నారంటూ వస్తున్న వార్తలను ఆ పార్టీ యువజన విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ తీవ్రంగా ఖండించారు. సోమవారం తన జన్మదినం సందర్భంగా సేలంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆశీస్సులు అందుకున్న సునీల్ మీడియాతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకేకు బలీయమైన క్యాడర్ వుందని, పార్టీని నమ్ముకుని కోట్లాదిమంది కార్యకర్తలున్నారన్నారు. తమ పార్టీ నుంచి సీనియర్లు ఎవ్వరూ ఇతర పార్టీల్లోకి వెళ్లడం లేదన్నారు. అన్నాడీఎంకే నుంచి సీనియర్లు వస్తున్నారంటూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. పార్టీ దూరంగా పెట్టిన వారు తప్ప, నిజమైన నేతలు, కార్యకర్తలెవ్వరూ ఇతర పార్టీల్లోకి వెళ్లడం లేదన్నారు. అన్నాడీఎంకేను నాశనం చేస్తామంటూ కొంతమంది ప్రగల్భాలు పలుకుతున్నారని, తమ పార్టీని పెకలించడం ఎవరి తరం కాదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఘన విజయం సాధిస్తుందని, ఆ మేరకు ఇప్పటి నుంచి కిందిస్థాయి నుంచి సన్నాహాలు జరుగుతున్నాయని సునీల్ వివరించారు.

డిసెంబరులోగా అందరూ ఒక్కటవుతారు

● ఓపీఎస్ మద్దతుదారుడు వైద్యలింగం



పెరంబూర్, సెప్టెంబరు 9: అన్నాడీఎంకేలో ఏర్పడిన గ్రూపులన్నీ డిసెంబరులోగా ఒక్కటవుతాయని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం మద్దతుదారుడు వైద్యలింగం తెలిపారు. సోమవారం జన్మదినం జరుపుకున్న వైద్యలింగంను కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యలింగం మాట్లాడుతూ... అన్నాడీఎంకేలోని 100 శాతం సభ్యుల్లో 99.9 శాతం మంది అన్ని వర్గాలు ఒకటి కావాలని కోరుకుంటున్నారన్నారు. 2026లో రాష్ట్రంలో మళ్లీ ఎంజీఆర్-జయలలిత పాలన తీసుకురావాలని కార్యకర్తలు కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే ఓట్ల శాతాన్ని 20 శాతానికి తగ్గించిన ఘనత ఈపీఎస్‌కు దక్కిందన్నారు. పార్టీలో ఏర్పడిన టీటీవీ దినకరన్, శశికళ, ఓపీఎస్, ఈపీఎస్‌లు వర్గాలన్నీ ఏకమయ్యే రోజు రానుందని వైద్యలింగం తెలిపారు.

సమాచార దర్శిని

14న గ్రూప్-2, 2ఏ పరీక్షలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: రాష్ట్రంలో గ్రూప్-2, 2ఏ పరీక్షలు ఈ నెల 14న జరుగనున్నాయి. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఆగస్టులో విడుదల కాగా, 7.94 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ప్రిలిమినరీ పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 38 జిల్లాల్లోని 2,763 కేంద్రాల్లో జరుగనుంది. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలి. హాల్ టిక్కెట్టుతో పాటు ఆధార్ కార్డు, పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు ఏదైనా ఒకదాని నకలు తీసుకురావాలి. ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్, హ్యాండ్ బాగ్ వంటివి తీసుకురాకూడదు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు టీఎన్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది.

17న మిలాదున్ నబి సెలవు

పెరంబూర్, సెప్టెంబరు 9: మిలాద్ ఉన్ నబి ప్రభుత్వ సెలవు రోజును ఈ నెల 16కు బదులుగా 17వ తేదీకి మారుస్తూ రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 17వ తేది మిలాదున్ నబి పండుగ జరుపుకోవాలని ప్రధాన హాజీ ప్రకటించిన నేపథ్యంలో, ఇదివరకు ప్రకటించిన 16వ తేదీని 17వ తేదీకి మార్పు తున్నట్లు ప్రభుత్వం పేర్కొనింది.

12న కావేరి ట్రిబ్యునల్ సమావేశం

పెరంబూర్, సెప్టెంబరు 9: కావేరి ట్రిబ్యునల్ సమావేశం ఈ నెల 12న ఢిల్లీల జరుగనుంది. ఈ సమావేశంలో అక్టోబరు నెలకు కుటాంచాల్సిన 20 టీఎంసీల నీటిని విడుదల చేసేలా కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశించాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిమాండ్ చేయనున్నారు. ఈ సమావేశంలో పాల్గొనాలని తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి కమిటీలకు ట్రిబ్యునల్ అధ్యక్షుడు వినీత్‌గుప్తా లేఖలు రాశారు.

నేటినుంచి సీఎం ట్రోఫీ

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: చెన్నై జిల్లా స్థాయిలో ముఖ్యమంత్రి ట్రోఫీ క్రీడా పోటీలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 24వ తేది వరకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు ఇలా ఐదు విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నారు.హాజరయ్యే క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకుని దరఖాస్తు నకలు, విద్యార్హత నకళ్లు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులు వారి గుర్తింపు కార్డులతో హాజరుకావాలి. వివరాలకు 7401703480 నెంబరు సంప్రదించవచ్చు.

చాగంటి ప్రవచనాల రద్దు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21, 22 తేదీల్లో జరగాల్సిన చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల కార్యక్రమం రద్దయింది. 'భారతీయతా వాహిని' ఆధ్వర్యంలో చెట్‌పేట్‌లోని కుచలాంబాళ్ కల్యాణ మండపంలో జరగాల్సిన ప్రవచన కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేయాల్సివచ్చిందని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

8న వైమానికదళ విన్యాసాలు

పెరంబూర్, సెప్టెంబరు 9: భారత వైమానికదళం 92వ వార్షికోత్సవం సందర్భంగా నగరంలో అక్టోబరు 8వ తేది వైమానికదళ విన్యాసాలు ప్రదర్శించనుంది. ఈ సందర్భంగా ఉదయం 7.45 గంటలకు సైనికులు కవాతు జరుగనుంది. అలాగే, మెరీనా తీరంలో విమానాల ప్రదర్శన నిర్వహించనున్నారు. 1932 అక్టోబరు 8వ తేది భారత వైమానిక దళం ఏర్పడింది. ఈ రోజును పురస్కరించుకొని ప్రతి ఏటా వేడుకలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వచ్చే నెల 8వ తేది వైమానిక దళం సైనికులు, విమానాలచే సాహస ప్రదర్శన నిర్వహించనున్నారు.

రూ.36 లక్షలతో క్యారమ్ క్రీడా కేంద్రం

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: స్థానిక కోడంబాక్కం మండలం జాఫర్‌ఖాన్‌పేటలో రూ.36 లక్షలతో క్యారమ్ క్రీడా కేంద్రం నిర్మిస్తున్నారు. జాఫర్‌ఖాన్‌పేటలో క్యారమ్ క్రీడాకారులు ఎక్కువ మంది ఉన్నారు. వీరు 139వ వార్డు ఆర్‌ఆర్ కాలనీలో కార్పొరేషన్ జిమ్‌లో క్యారమ్స్ ఆడుతున్నారు. తమకు ప్రత్యేక క్రీడా కేంద్రం కావాలని కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేయడంతో, ఈ కేంద్ర నిర్మాణానికి కార్పొరేషన్ రూ.36 లక్షలు కేటాయించింది. ఆ నిధులతో ఆర్‌ఆర్ కాలనీలో క్యారమ్స్ క్రీడా కేంద్రం నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి.

లక్ష మందికి త్వరలో రేషన్ కార్డులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: రాష్ట్రంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు లక్ష మందికి త్వరలో రేషన్ కార్డులు అందజేస్తామని ఆహార సరఫరా శాఖ అధికారులు తెలిపారు. అన్ని జిల్లాల్లో 2,24,13,920 రేషన్ కార్డులున్నాయి. కొత్త రేషన్ కార్డు కోసం 3 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలివిడతగా 92 వేల మందికి కార్డులు అందజేసేందుకు ప్రభుత్వం అనుమతించగా, ఇప్పటివరకు 80 వేల మందికి అందజేశారు. ఈ నేపథ్యంలో, 2.80 లక్షల మంది కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోగా,వారిలో లక్షమందికి త్వరలో కార్డులు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

గిండి రేస్ కోర్స్ మైదానానికి సీలు

పెరంబూర్, సెప్టెంబరు 9: స్థానిక గిండి రేస్ కోర్స్ మైదానానికి రెవెన్యూ అధికారులు సీలు వేశారు. న్యాయస్థానం ఉత్తర్వులతో సోమవారం ఉదయం తహసీల్దార్ నేతృత్వంలో అధికారులు 160 ఎకరాల రేస్ మైదానంలో నాలుగు గేట్లకు సీలు వేశారు. రేస్ కోర్సు నిర్వాహకులు రూ. కోట్ల లో పన్ను బకాయిలు చెల్లించలేదనే ఫిర్యాదుతో, మద్రాసు హైకోర్టు ఉత్తర్వులతో రెవెన్యూ అధికారులు సీలు వేశారు. రేస్ క్లబ్ ఉద్యోగులను గేటు వద్దే అధికారులు అడ్డుకోగా, ఆ ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

కార్పొరేషన్ అధికారులకు ట్యాబ్‌లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: కార్పొరేషన్ అధికారులకు ట్యాబ్‌లు అందజేయనున్నారు. విద్య, ఆరోగ్యం, భవన నిర్మాణం, రహదారులు వంటి వివిధ శాఖల్లో డిప్యూటీ కమిషనర్లు ఆన్‌లైన్‌లో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం అన్ని మండల కార్యాలయాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. ఆయా మండల సహాయ కమిషనర్లు, ఇంజనీర్లు, అధికారులు సమావేశాల్లో పాల్గొంటారు. ఆయా వార్డుల నుంచి అధికారులు మండల కార్యాలయాలకు వెళ్లాల్సి ఉండడంతో, వార్డు పనుల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. దీనిని నివారించేలా 15మండలాల్లో ఉన్న అధికారులకు ట్యాబ్‌లను అందజేయనున్నారు. తొలివిడతగా కార్య నిర్వాహక ఇంజనీర్లు, మండల సహాయ కమిషనర్, పర్యవేక్షణ ఇంజనీర్లు, ప్రధాన ఇంజనీర్లు, మండల రెవెన్యూ, ఆరోగ్య అధికారులకు ఈ నెలాఖరులోపు ట్యాబ్‌లు అందజేయనున్నట్లు కార్పొరేషన్ తెలిపింది.

మౌంట్-వేళచ్చేరి మధ్య రైలుపట్టాల ఏర్పాటు

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: సెయింట్ థామస్ మౌంట్-వేళచ్చేరి మెట్రో మార్గంలో రైలుపట్టాల ఏర్పాటుపనులు జరుగుతున్నాయి. ఈ నెలాఖరులోపు రైలుపట్టాలు ఏర్పాటుచేసి, ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు సీఎంఆర్‌ఎల్ అధికారులు తెలిపారు. దానికి ముందు చెన్నై ఐఐటీ నిపుణుల బృందం ఈ ఫ్లై ఓవర్ స్తంభాల పటిష్టతను తనిఖీ చేయనున్నారని పేర్కొన్నారు.

లంక జైలులో ఉన్న జాలర్లను విడిపించాలి

● కేంద్ర ప్రభుత్వానికి సీఎం లేఖ

ప్యారీస్, సెప్టెంబరు 9: శ్రీలంక జైలులో ఉన్న రాష్ట్ర జాలర్లు, వారి పడవలు విడిపించడంతో పాటు వారికి విధించిన జరిమానా రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం లేఖ రాశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... శ్రీలంక నావికాదళం భారత సముద్ర సరిహద్దులు దాటారంటూ రాష్ట్ర జాలర్లను అరెస్ట్ చేయడం కొనసాగుతోందని, ఈ నెల 7వ తేది పుదుకోట జిల్లాకు చెందిన 14 మంది జాలర్లను అరెస్ట్ చేసి, వారికి సొంతమైన 14 మరబోట్లు స్వాధీనం చేసుకున్నారని సీఎం తన లేఖలో సూచించారు. ఈ ఏడాది ఆదివారం వరకు 350 మంది తమిళ జాలర్లు అరెస్టయ్యారని, వారికి చెందిన 49 పడవలు స్వాధీనం చేసుకున్నారని, జాలర్లను, వారి పడవలను విడిపించి వారి కుటుంబాలను ఆదుకోవాల్సిందిగా సీఎం స్టాలిన్ కేంద్ర మంత్రికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

జాలర్ల నిరాహారదీక్ష...

శ్రీలంక జైలులో బందీలుగా ఉన్న 22 మంది జాలర్లను విడుదల చేయించాలని కోరుతూ సోమవారం తూత్తుకుడి సమీపంలోని తరువైకుళంలో మత్స్యకారులు నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఈ ప్రాంతానికి చెందిన అంతోని అనే జాలరికి చెందిన రెండు పడవల్లో జూలై 20వ తేది తరువైకుళం, అరసడి, వేంబార్ తదితర ప్రాంతాలకు చెందిన 22 మంది జాలర్లు చేపల వేటకు వెళ్లగా, సరిహద్దు దాటారంటూ శ్రీలంక నావికాదళం పడవలు సహా జాలర్లను అరెస్ట్ చేసింది. వీరిని కోర్టులో హాజరుపరచగా వీరికి మొత్తం రూ.3.50 కోట్ల జరిమానా విధించిన ఆ



తరువైకుళంలో నిరాహారదీక్ష చేస్తున్న జాలర్ల గ్రామాల ప్రజలు

దేశ న్యాయస్థానం, చెల్లించని పక్షంలో సంవత్సరం అదనంగా జైలుశిక్ష అనుభవించాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో, బాధిత జాలర్ల కుటుంబ సభ్యులు తూత్తుకుడి కలెక్టర్ వద్ద జరిమానా లేకుండా జాలర్లను విడిపించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఇదే కోరికతో పలు రాజకీయ పార్టీలు కూడా ఆందోళన నిర్వహించాయి. అయితే, ఈ వ్యవహారంలో ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో ఆగ్రహించిన జాలర్ల గ్రామాలకు చెందిన ప్రజలు తరువైకుళంలో సోమవారం నిరాహారదీక్ష చేపట్టారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు జాలర్లను విడిపించేలా తక్షణ చర్యలు చేపట్టిన పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

13న స్పీకర్ అప్పావు హాజరుకావాలి

● ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, సెప్టెంబరు 9: అన్నాడీఎంకే దాఖలుచేసిన కేసులో స్పీకర్ అప్పావు స్వయంగా హాజరుకావాలని ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన 40 మంది ఎమ్మెల్యేలు డీఎంకేలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, కానీ స్టాలిన్ అందుకు అంగీకరించలేదని స్పీకర్ అప్పావు తెలిపారు. ఈ వ్యవహారంపై స్పీకర్‌కు వ్యతిరేకంగా అన్నాడీఎంకేకు చెందిన బాలు మురుగవేల్ పిటిషన్ వేశారు. మద్రాసు హైకోర్టు కూడా ఈ కేసు విచారణకు ఆమోదం తెలిపింది. ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన కేసులు విచారిస్తున్న ప్రత్యేక కోర్టులో ఈ కేసు విచారణ సాగుతోంది. ఈ కేసు విచారణ సోమవారం న్యాయమూర్తి జయవేల్ విచారించారు. ఈ కేసుకు సంబంధించిన స్పీకర్ అప్పావు, మధ్యాహ్నం 2.30 గంటలకు హాజరుకావాలని ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యాహ్నం ఈ కేసు విచారణ ప్రారంభం కాగా స్పీకర్ తరఫున హాజరైన న్యాయవాది... సమన్లు తమకు అందలేదని, అందినట్లయితే స్పీకర్ అప్పావు తప్పకుండా హాజరై ఉండేవారని తెలిపారు. అలాగే, సమన్లు నిరాకరించలేదని, కోర్టు తెలిపిన తేదీలో అప్పావు హాజరవుతారని తెలియజేశారు. ఈ వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, కేసు విచారణ ఈనెల 13వ తేదీకి వాయిదా వేస్తూ, ఆరోజున స్పీకర్ అప్పావు హాజరుకావాలని ఉత్తర్వులు జారీచేశారు.

జనాభా లెక్కలతో పాటు కులగణన

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

పెరంబూర్, సెప్టెంబరు 9: జనాభా లెక్కలతో పాటు కులాల వారీగా గణన చేపట్టాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... 2021లో జనాభా లెక్కలు నిర్వహించి ఉంటే, బీజేపీ ప్రభుత్వంలో ప్రజల జీవనాధారం, పేదరికం తదితరాలు తెలిసే అవకాశం ఉండేదన్నారు. 10 ఏళ్ల బీజేపీ పాలనలో 20 కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖ దిగువన చేరారని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయన్నారు. దేశంలో జనాభా లెక్కలతోపాటు కులాల వారీ గణన చేపట్టాలని ఇండియా కూటమి తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

టాస్మాక్‌లో తగ్గిన 'బీరు' అమ్మకాలు

● సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు

ప్యారీస్, సెప్టెంబరు 9: టాస్మాక్ దుకాణాల్లో బీరు విక్రయాలు తగ్గడానికి గల కారణాలను అడుగుతూ సిబ్బంది వద్ద అధికారులు విచారణ జరుపుతున్నారు. రాష్ట్రంలో టాస్మాక్ దుకాణాల ద్వారా బీరు, బ్రాంది, విస్కీ, రమ్, జిన్ తదితర మద్యం రకాలు విక్రయిస్తున్నారు. వీటి ద్వారా రాష్ట్రప్రభుత్వానికి గత సంవత్సరంలో రూ.45,855.67 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ నేపథ్యంలో, టాస్మాక్ సంస్థ ఇటీవల మద్యం విక్రయాలపై నిర్వహించిన సర్వేలో గత ఆగస్టు నెలలో రాష్ట్రవ్యాప్తంగా బీరు అమ్మకాలు 10.69 శాతం తగ్గినట్లు తెలిసింది. తగ్గడానికి గల కారణాలు చెప్పాలంటూ టాస్మాక్ అధికారులు సిబ్బందిని నిలదీయడంతో పాటు కొంతమంది జిల్లా సూపర్‌వైజర్లను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు టాస్మాక్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు.

శాంతి భద్రతల పర్యవేక్షణలో డీఎంకే విఫలం

●పీఎంకే నేత డా.రాందాస్

పెరంబూర్, సెప్టెంబరు 9: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఒకేరోజు ఆరు హత్యలు జరగడం ఆందోళన కలిగిస్తుందని, రాష్ట్రంలో శాంతి భద్రతల పర్యవేక్షణలో డీఎంకే ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే అధికారం చేపట్టిన 2021-22వ సంవత్సరంలో 1,558 హత్యలు, 2022-23లో 1,596 హత్యలు, 18 కూలి ముఠాల హత్యలు జరిగాయని శాసనసభలో ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా ప్రకటించారన్నారు. ఇక, 2023-24వ సంవత్సరంలో 1,600 హత్యలు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయని, ఆ ప్రకారం, మూడేళ్లలో 5,000 హత్యలు జరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో హత్యలు, నేరాలకు ప్రధాన కారణంగా మద్యం, గంజాయి మత్తు అన్నారు. విద్యార్థులు సైతం గంజాయికి బానిసలై నేరాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తుందన్నారు. మద్యం దుకాణాలు మూసివేసి, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాందాస్ డిమాండ్ చేశారు.

విధి నిర్వహణలో ఉన్న మహిళలకు రక్షణ కల్పించాలి

● మహిళా సంఘాల డిమాండ్



ఎగ్మూర్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్యారీస్, సెప్టెంబరు 9: విధి నిర్వహణలో ఉన్న మహిళలకు రక్షణ కల్పించాలని నగరంలోని మహిళా సంఘాలు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను డిమాం డ్ చేశాయి. ఎగ్మూర్ రాజరత్నం స్టేడియం సమీపంలో సోమవారం ఎఫ్ఓజీఎస్ఐ, ఓజీఎస్ఎస్ఐ, చెన్నై మెనోపాస్ సొసైటీ, ఏఏడీడబ్ల్యూఏ, మహిళల న్యాయ సహాయ కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల కొల్‌కొత్తాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం ఘటనను ఖండిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాక్సీ ఛైర్మెన్ జయదీప్ డేంగ్, ప్రధాన కార్యదర్శి డా.మాధురి పటేల్, డా.జయరాణి కామరాజ్ తదితరులు మాట్లాడుతూ... కొల్‌కొత్తా ట్రైనీ డాక్టర్ కేసులో ఇప్పటివరకు న్యాయం జరుగలేదని, ఇందులో సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



వేడుకల్లో ఎమ్మెల్యే కార్తికేయన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 9: స్థానిక చిన్నఅల్లాపురం నేతాజీ వీధిలో ఉన్న భామా రుక్మిణి సమేత కృష్ణ ఆలయంలో సోమవారం మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. వేడుకల్లో కలవై సచ్చిదానంద స్వామి, ఒచ్చేరి మేగానంద స్వామి, స్థానిక ఎమ్మెల్యే కార్తికేయన్, కేకే పెట్రోల్ బంక్ యజమాని కుమరేశన్, 48వ వార్డు కౌన్సిలర్ కోకిల శక్తి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను గ్రామ గౌరవాధ్యక్షుడు దామోదరన్, సుబ్రమణి, గోవిందస్వామి, రాజేంద్రన్, విజయన్, ధరణి, సెంథిల్‌కుమార్, గ్రామ సెక్రటరీ శరవణన్, గ్రామ కోశాధికారి మణికంఠన్ పర్యవేక్షించగా, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, సెప్టెంబరు9: నగరంలో మరో ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు వచ్చింది. అభిరామపురంలోని చెట్టినాడు హరివిద్యాశ్రమానికి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. పాఠశాల నిర్వాహకులకు పోలీసులకు తెలియజేయడంతో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో చేరుకున్న పోలీసులు పాఠశాల, ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, బాంబు బెదిరింపు ఫేక్‌గా తేల్చారు.

నిమజ్జనం ఊరేగింపులో అపశృతి

● ట్రాక్టర్ ఒరిగి ముగ్గురు బాలుర మృతి

పెరంబూర్, సెప్టెంబరు 9: దేవారం సమీపంలో వినాయక విగ్రహాల నిమజ్జనాల సందర్భంగా ట్రాక్టర్ ఒరిగిపడి ముగ్గురు బాలురు మృతిచెందారు. తేని జిల్లా దేవారం సమీపం మరువట్టి సహా పలు గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా వినాయకుడి విగ్రహాలు పెట్టారు. పూజల అనంతరం ఆదివారం సాయంత్రం ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని మార్కండేయకోట సమీపంలోని ముల్లైపెరియార్ నదిలో నిమజ్జనం కార్యక్రమం చేపట్టారు. నిమజ్జనం అనంతరం విగ్రహాలు తీసుకొచ్చిన వాహనాల్లో తిరుగుప్రయాణమయ్యారు. ఆ సమయంలో మరవపట్టి నుంచి వచ్చిన ట్రాక్టర్ కృష్ణన్‌పట్టి సమీపంలో మలుపు తిరుగుతుండగా ఒక పక్కకు ఒరిగిపడింది. ఈ ఘటనలో మరవపట్టి కాళియమ్మన్ ఆలయ వీధికి చెందిన విశాల్ (14), మెయిన్ రోడ్డుకు చెందిన నివాస్ (15), పంచపాండవర్ ఆలయ వీధికి చెందిన కిషోర్ (14) ట్రాక్టర్ కింద పడి మృతిచెందగా, మరికొందరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దేవారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకేరోజు 11 మంది గంజాయి వ్యాపారుల అరెస్ట్

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: ఉత్తర చెన్నైలో ఒకేరోజు 11 మంది గంజాయి వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓల్డ్ వాషర్‌మెన్‌పేట వీరాకుట్టి వీధిలో ఉన్న ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నట్లు ఆర్కే నగర్ పోలీసులకు ఆదివారం సాయంత్రం ఫిర్యాదు అందింది. ఆ ఇంట్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు 25 చిన్న గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అదే ప్రాంతానికి చెందిన సతీష్, తండయార్‌పేట నెహ్రూ నగర్‌కు చెందిన సురేష్‌లను అరెస్ట్ చేశారు. అలాగే, వ్యాసర్పాడి పల్లప్ప వీధిలో తనిఖీ చేసి గంజాయి విక్రయిస్తున్న ఎంకేబీ నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ పూవరసన్, దామోదరన్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ తంగమణి, పార్తీపన్, కెరీనాలను అరెస్ట్ చేశారు. వాషర్‌మెన్‌పేట బోజరాజపురంలో నిర్వహించిన తనిఖీల్లో వివిధ కేసుల్లో ఇదివరకే అరెస్టయిన తండయార్‌పేట అజీస్ నగర్‌కు చెందిన గంజాయి వ్యాపారులు నితిన్‌కుమార్, ఓల్డ్ వాషర్‌మెన్‌పేటకు చెందిన విజయ్, అజిత్, మణికంఠన్, సత్యలను అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.

అవయవాల కోసం 7,815 మంది నిరీక్షణ

● మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, సెప్టెంబరు 9: రాష్ట్రంలో మూత్రపిండాలు, గుండె సహా పలు అవయవాలు అవసరమైన 7,815 మంది నిరీక్షిస్తున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పల్లావరానికి చెందిన మురళి (59) అనే వ్యక్తి మెదడు నిర్జీవమైన నేపథ్యంలో, ఆయన అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో, ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం మురళి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ ఆస్పత్రిలో ఈ పథకం అమలుచేసిన 2023 డిసెంబరు 23వ తేది నుంచి ఇప్పటివరకు మెదడు నిర్జీవమైన 250 మంది నుంచి 1,330 అవయవాలు పొందామన్నారు. 2008 నుంచి ఇప్పటివరకు మెదడు నిర్జీవమైన 1,976 మంది అవయవాలు దానం చేశారని తెలిపారు. గత మూడేళ్లలో మాత్రమే 563 మంది అవయవాలు దానం చేయగా, ప్రస్తుతం పలు ఆస్పత్రుల్లో అవయవాలు అవసరమైన 7,815 మంది వేచి ఉన్నారని మంత్రి తెలిపారు.

సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో కుళ్లిన మాంసం స్వాధీనం



కుళ్లిన మాంసాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెరంబూర్, సెప్టెంబరు 9: స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో 1,556 కిలోల పాడైపోయిన మాంసాన్ని ఆహార భద్రతా శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. న్యూఢిల్లీ నుంచి చెన్నై సెంట్రల్‌కు చేరుకున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్ పార్శిల్ బోగీ నుంచి దించిన బస్తాల్లో దుర్వాసన రావడంతో, అధికారులు తనిఖీ చేసి, చెడిపోయిన 1,556 కిలోల మాంసం గుర్తించారు. గత నెల 21వ తేది కూడా రాజస్తాన్ నుంచి చెన్నైకి వచ్చిన రైలులో 600 కిలోల చెడిపోయిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా లభించిన మాంసాన్ని నగరంలోని హోటల్స్, మాల్స్, స్టార్ హోటళ్లకు తరలిస్తున్నట్లు అధికారుల ప్రాథమికంగా నిర్ధారించారు. పార్శిల్ పంపిన చిరునామా ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

బీడు భూముల విముక్తి ప్రయాణం



ప్రసంగిస్తున్న శివకామి

వేలూరు, సెప్టెంబరు9: సమూహ సమత్తువ పడై ఆధ్వర్యంలో బీడు భూముల విముక్తి ప్రయాణం జరిగింది. ఈ నెల 1న చెన్నైలో ప్రారంభమైన ఈ ప్రయాణం ధర్మపురి, ఆరూర్, సేలం, తలైవాసల్, తంజావూరు, తిరుచ్చి, దిండుగల్, తేని మీదుగా నగరానికి చేరుకుంది. అన్నా ఆడిటోరియం వద్ద జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర సెక్రటరీ భీంరావ్ అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షుడు భాస్కరన్, కోశాధికారి ధర్మేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా స్థాపక అధ్యక్షురాలు శివకామి పాల్గొని, ఈ ప్రయాణ వివరాలను ప్రజలకు వివరించారు. బీడు భూములను ప్రభుత్వం వెంటనే గుర్తించి, అవి ఆక్రమణలకు గురై ఉంటే విముక్తి చేసి అర్హులైన ప్రజలకు అందజేయాలని ఆమె డిమాండ్ చేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన డాక్టర్ సస్పెన్షన్

వేలూరు, సెప్టెంబరు 9: గుడియాత్తం ప్రభుత్వాస్పత్రిలో ట్రైనీ నర్సుపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రభుత్వ బాబుపై సస్పెన్షన్ వేటుపడింది. బాధిత ట్రైనీ నర్సు అందజేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు, వైద్యుడు బాబును అరెస్ట్ చేసి వేలూరు జైలుకు తరలించారు. ఈ నేపథ్యం లో, బాబును సస్పెండ్ చేస్తూ ఆరోగ్యశాఖ డైరెక్టర్ రాజమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వాసుపత్రికి దేహ దానం



మృతురాలు వల్లియమ్మాళ్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, సెప్టెంబరు 9: వేలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు మృతిచెందిన వ్యక్తి కోరిక మేరకు భౌతిక దేహాన్ని అప్పగించారు. సీఐటీయూ కార్మిక సంఘం వేలూరు, తిరుపత్తూర్ జిల్లాల అధ్యక్షుడు మురళి తల్లి వల్లియమ్మాళ్ (85) వృద్ధాప్యం కారణంగా ఆదివారం రాత్రి మృతిచెందారు. తాను మృతిచెందితే తన భౌతిక దేహాన్ని ప్రభుత్వాస్పత్రికి అప్పగించాలని వల్లియమ్మాళ్ ఆమోద పత్రం రాశారు. దీంతో, ఆమె భౌతిక దేహాన్ని సోమవారం రెడ్‌క్రాస్ సంఘం కాట్పాడి శాఖ అవై అధ్యక్షుడు జనార్ధనన్, మేనేజింగ్ కమిటీ సభ్యుడు రమేష్‌కుమార్ జైన్, సీపీఎం జిల్లా కార్యదర్శి దయానిధి, జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణన్, కాత్తవరాయన్, డివిజన్ కార్యదర్శి సెల్వి లు కళాశాల నిర్వాహకులకు అప్పగించారు.

12 నుంచి పొంగల్ రైల్ రిజర్వేషన్ ప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 9: ప్రతి ఏడాది దీపావళి, సంక్రాంతి పండుగలను సొంతూర్లలో జరుపుకొనేందుకు నగరం నుంచి సుమారు 6 లక్షల మంది వెళ్తుంటారు. వారిలో అధిక శాతం రైళ్లలోనే ప్రయాణిస్తుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైలు టిక్కెట్లు 120 రోజుల ముందుగానే రిజర్వేషన్ చేసుకొనే సౌకర్యం కల్పించారు. వచ్చే ఏడాది జనవరి 13వ తేది (సోమవారం) బోగి, 14వ తేది (మంగళవారం) సంక్రాంతి, 15వ తేది (బుధవారం) మాట్టు పొంగల్, 16వ తేది (గురువారం) కనుమ పండుగ రానున్నాయి. ఈ నేపథ్యంలో రైలు టిక్కెట్లు ముందస్తు రిజర్వేషన్ ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుంది. ఆ ప్రకారం, జనవరి 10వ తేది ప్రయాణం చేయాలనుకొనే వారు ఈ నెల 12వ తేది, జనవరి 11వ తేదికి ఈనెల 13, జనవరి 12వ తేది ప్రయాణించే వారు ఈ నెల 14వ తేది టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు. అలాగే, జనవరి 13వ తేది బోగి రోజున ప్రయాణించే వారు ఈ నెల 15వ తేది రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఐఆర్‌టీసీ వెబ్‌సైట్ ద్వారా ఆయా తేదీల్లో టిక్కెట్లు రిజర్వ్ చేసుకోవచ్చని దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది.

ఆన్‌లైన్ రిజర్వేషన్లపై అభిప్రాయ సేకరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ జరుగనుంది. ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజు నడిపే 2,500లకు పైగా బస్సుల్లో ఈ శాఖ వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకుంటున్నారు. వారి సౌకర్యార్థం సీటు, బెర్త్ సౌకర్యం కలిగిన 150 కొత్త డీలక్స్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ఆన్‌లైన్ రిజర్వేషన్ ఎక్కువగా వినియోగించడంపై ప్రయాణికుల నుంచి అభిప్రాయం సేకరించేందుకు రవాణా శాఖ నిర్ణయించింది. ptcsoffice2023@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాలో అభిప్రాయాలు తెలియజేయాలని ప్రయాణికులను కోరింది.

ముగిసిన ఇంజనీరింగ్ సబ్ కౌన్సెలింగ్

పెరంబూర్, సెప్టెంబరు 9: ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్ సబ్ కౌన్సెలింగ్ ఆదివారం ముగిసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రభుత్వ కోటా సీట్ల భర్తీకి నిర్వహించిన మూడు విడతల కౌన్సెలింగ్‌లో 1,25,031 సీట్లు భర్తీ కాగా, 70,403 ఖాళీలున్నాయి. ఈ ఖాళీ సీట్లకు ప్లస్ టూ సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని, వారికి సబ్ కౌన్సెలింగ్ జరుపనున్నట్లు ఉన్నత విద్యా శాఖ ప్రకటించింది. ఈ సబ్ కౌన్సెలింగ్ ఈ నెల 6న ప్రారంభమై ఆదివారంతో ముగిసింది. అందులో పాఠశాల విద్య ముగించిన 8,486 మంది, వృత్తి విద్య పూర్తయిన 178 మంది, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేటాయించిన 7.5 శాతం కోటాలో 160 మంది, సాంకేతిక విద్య విభాగంలో 18 మంది సీట్లు పొందారు. వీరికి తాత్కాలిక అడ్మిషన్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో, బీసీ, అరుంధతీయ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీట్లకు మంగళ, బుధవారాల్లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

పంచాయతీల్లోనూ ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరి

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతి పొందే విధానం పంచాయతీల్లోనూ తప్పనిసరి చేశారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ సహా మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీలు, పంచాయతీల్లో సీఎండీఏ అనుమతి మేరకే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు వేర్వేరు వెబ్‌సైట్ల ద్వారా అనుమతి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, పంచాయతీల్లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొనే విధానం అమలుకు వచ్చింది. నగరంలోని 10 పంచాయతీ యూనియన్ పరిధిలోని పంచాయతీల్లో తప్పనిసరిగా భవన నిర్మాణాలు చేపట్టేవారు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాల్సి ఉందని సీఎండీఏ అధికారులు వెల్లడించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

పెరంబూర్, సెప్టెంబరు 9: రాష్ట్రంలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు డీఎండీకే సిద్ధంగా ఉందని, ఎన్నికల్లో పోటీచేసే ప్రాంతాలు ఎంపిక చేస్తున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత తెలిపారు. తిరువళ్లూర్ జిల్లాలో పార్టీ నాయకుడి ఇంటి శుభకార్యంలో పాల్గొన్న ప్రేమలత మీడియాతో మాట్లాడుతూ... స్థానిక అశోక్‌నగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో జరిగిన కార్యక్రమాన్ని ఖండిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎవరు అనుమతించారు, ఎవరు ఏమి మాట్లాడారు అనే విషయమై స్పష్టమైన విచారణ చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ విదేశాల నుంచి తీసుకున్న పెట్టుబడులు వాస్తవమైతే స్వాగతిస్తామన్నారు. తమిళగ వెట్రి కళగంతో డీఎండీకే పొత్తు ఉంటుందా అనే విలేఖరుల ప్రశ్నకు, ఆ విషయాన్ని నటుడు విజయ్‌ను అడగాలని ప్రేమలత సూచించారు.

రవాణా కార్మికులకు రుణ సహాయాల నిలిపివేత

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: రవాణా కార్మికులకు రుణ సహాయాలను సహకార రుణ సంఘం నిలిపివేసింది. రవాణా సంస్థ సభ్యుల రుణాలకు సంబంధించిన పైకాన్ని వేతనంలో కట్ చేసుకున్న నెల వాయిదాలు రూ.22 కోట్లు సంఘాలకు చెల్లించకుండా చెన్నై మెట్రోపాలిటన్ రవాణా సంస్థ, విల్లుపురం రవాణా సంస్థ, ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థలు బకాయిలుంచాయి. దీంతో కార్మికులకు రుణాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సహకార రుణ సంఘం నిర్వాహకులు తెలిపారు.

గంజాయితో ప్రైవేటు పాఠశాల టీచర్ అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు9: ఆంధ్రరాష్ట్రం నుంచి రైలులో 6 కిలోల గంజాయి తరలిస్తున్న ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు కటకటాలపాలయ్యారు. తిరువొత్తియూర్ రైల్వేస్టేషన్‌లో సందేహంగా సంచరిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. మదురైలో ని ఓ ప్రైవేటు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అరవింస్వామి అని, ఆంధ్రాల్లి గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు తేలడంతో, ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం ఉందా అని పోలీసులు విచారిస్తున్నారు.

వేతనాల కోసం సామ్‌సంగ్ కార్మికుల ధర్నా

పెరంబూర్, సెప్టెంబరు 9: వేతనాలు పెంచాలంటూ సామ్‌సంగ్ కర్మాగారం కార్మికులు సోమవారం ధర్నా చేపట్టారు. కాంచీపురం జిల్లా సుంకువారసత్రంలోని సామ్‌సంగ్ కర్మాగారం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో వందలాది మంది కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటు నినాదాలు చేశారు.

కల్వి ఛానల్‌లో పోటీ పరీక్షల శిక్షణ ప్రసారం

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: పోటీ పరీక్షలకు సంబంధించిన శిక్షణా తరగతులను కల్వి ఛానల్ ద్వారా పాఠశాల విద్యాశాఖ త్వరలో ప్రసారం చేయనుంది. ఈ శాఖ ఆధ్వర్యంలోని ఈ టీవీ ఛానల్‌లో విద్యకు సంబంధించిన కార్యక్రమాలు ప్రసారమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, టీఎన్‌పీఎస్సీ పోస్టుల భర్తీకి నిర్వహించే రాతపరీక్షలకు సంబంధించిన శిక్షణా తరగతులు కూడా ప్రసారం చేసేందుకు నిర్ణయించింది. ఒక్కో తరగతి 30 నిమిషాల పాటు ఉంటుంది. ఈ తరగతుల టైంటేబుల్ www.tamilnaducreerservices.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

శనివారాల్లోనూ నాగపట్టణం-శ్రీలంక నౌక రవాణా

ఐసిఎఫ్, సెప్టెంబరు 9: ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు శనివారం కూడా నాగపట్టణం-శ్రీలంక నౌక రవాణా సేవలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. నాగపట్టణం హార్బర్ నుంచి శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు వెళ్లే నౌకకు ప్రయాణికుల సంఖ్య తగ్గడంతో వారంలో మూడు రోజులు (మంగళ, గురు, ఆదివారాలు) మాత్రమే నడుపనున్నట్లు నౌకా సంస్థ తెలిపింది. ఈ క్రమంలో, ప్రయాణికులు శనివారం కూడా నౌక నడపాలని విజ్ఞప్తి చేశారు. వారి కోరిక మేరకు ఈ నెల 21 నుంచి శనివారాల్లోనూ ఈ సేవలు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలియజేసింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతి

ప్యారీస్, సెప్టెంబరు 9: తిరువణ్ణామలై జిల్లా వందవాసిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందారు. కాంచీపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకుంటున్న ఆకాష్ (22), విజయన్ (33), శివ (30) అనే వారు బైక్‌లో కాంచీపురంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన ఓ బైక్ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై వందవాసి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రక్తదాన శిబిరానికి స్పందన



వేలూరు, సెప్టెంబరు 9: గుడియాత్తం కామాక్షియమ్మన్‌పేట అయ్యస్వామి వీధి యువకులచే సోమవారం రక్తదాన శిబిరం, ఉచిత ఫిజియోథెరపి చికిత్స నిర్వహించారు. సంతపేటలోని వళ్లలార్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సుమారు వంద మందికి పైగా రక్తదానం చేయగా, 100 మందికి ఫిజియోథెరపిపై అవగాహన, చికిత్స అందజేశారు.



చెన్నైలోని నడిగర్ సంఘం భవన నిర్మాణం కోసం రూ. కోటి విరాళమిచ్చిన రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధిని కలుసుకొని ధన్యవాదాలు తెలుపుతున్న ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాజర్, విశాల్, కోశాధికారి కార్తీ తదితరులు

ప్రముఖ నిర్మాత ఢిల్లీబాబు మృతి

● కోలీవుడ్ దిగ్భ్రాంతి

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ సినీ నిర్మాత, యాక్సెస్ ఫిల్మ్ అధినేత, తమిళ చిత్ర నిర్మాతల మండలి కార్యవర్గ సభ్యుడు జి.ఢిల్లీబాబు (50) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ వైద్యం చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం రాత్రి 12.30 గంటల సమయంలో పెరుంగళత్తూరులోని స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన మృతిపై కోలీవుడ్ దిగ్భ్రాంతిని వ్యక్తంచేసింది. పలువురు సినీ ప్రముఖులు ఢిల్లీబాబు మృతిపట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేస్తున్నారు. కాగా 2015లో 'ఉరుమీన్' అనే చిత్రం ద్వారా నిర్మాతగా ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టిన ఆయన... ఆ తర్వాత 'మరగద నాణయం', 'ఇరవుక్కు ఆయిరం కణ్‌గల్', 'రాక్షసన్', 'ఓ మై కడవులే', 'బ్యాచిలర్', 'మిరల్', 'కల్వన్' వంటి అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. కోలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాతగా వరుస చిత్రాలు నిర్మించిన ఢిల్లీబాబు ప్రస్తుతం పలువురు యువదర్శకులతో చిత్రాలు నిర్మించేందుకు అడ్వాన్సులు కూడా ఇచ్చారు. తన కుమారుడు దేవ్ హీరోగా 'వలైయమం' అనే చిత్రాన్ని కూడా నిర్మిస్తున్నారు. ఢిల్లీబాబు మృతిపట్ల తమిళ సినీ నిర్మాతల మండలి సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. ఢిల్లీబాబు అంత్యక్రియలు సోమవారం ముగిశాయి.



నిర్మాత ఢిల్లీబాబు (ఫైల్‌ఫొటో)

చిత్రజ్యోతి



సిమ్రన్ ప్రధాన పాత్రలో 'ది లాస్ట్ వన్'

దీపక్ సహ నిర్మాణంలో లోకేష్ కుమార్ దర్శకత్వంలో సిమ్రన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది లాస్ట్ వన్'. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో హార్రర్, ఫాంటసీ జోనర్‌లో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా ద్వారా సిమ్రన్ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి 28 వసంతాలు పూర్తి చేసుకోనున్నారు. ఇటీవల ఆమె నటించిన 'గుల్‌మొహర్', 'రాకెట్రీ' వంటి చిత్రాలు సినిమా విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకున్నాయి. అలాగే, ప్రశాంత్ హీరోగా వచ్చిన 'అంధగన్' చిత్రంలో విల్లీ పాత్ర పోషించిన సిమ్రన్.. తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. ఇపుడు మరో కొత్త చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకురానున్నారు.

'లబ్బర్ బంతు'తో ఆ రెండు తీరాయి

● హరీష్ కళ్యాణ్



'లబ్బర్ బంతు'లో హరీష్ కళ్యాణ్

ప్రిన్స్ బ్యానరులో తాను హీరోగా నటించిన 'లబ్బర్ బంతు'తో గ్రామీణ యువకుడిగా, క్రీడా నేపథ్యం ఉన్న సినిమాలో నటించాలన్న రెండు కోరికలు ఒకేసారి తీరాయని హీరో హరీష్ కళ్యాణ్ అన్నారు. కథా రచయిత తమిళరసన్ పచ్చముత్తు దర్శకుడిగా పరిచయమవుతూ రూపొందించిన ఈ చిత్రంలో హరీష్ కళ్యాణ్, అట్టకత్తి దినేష్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా గురించి హీరో హరీష్ కళ్యాణ్ మాట్లాడుతూ, 'స్టోరీ వినగానే ఈ ప్రాజెక్టులోకి అడుగుపెట్టిన తొలి నటుడిని నేనే. ఇప్పటివరకు నగరవాసిగానే నటించాను. ఒక క్రీడా నేపథ్యం ఉన్న చిత్రం, గ్రామీణ యువకుడిగా నటించాలన్న కోరిక ఎప్పటి నుంచో ఉంది. ఈ కథలో ఈ రెండు ఉన్నాయి. అందుకే మరో ఆలోచన లేకుండా ఒకే చెప్పేశాను. కథ సాగే గ్రామం, అక్కడి ప్రజలు, క్రికెట్ పైత్యంతో వీధుల్లో తిరిగే ఒక యువకుడు, స్టోరీని దర్శకుడు నరేట్ చేసిన విధానం ఇలా ప్రతి అంశం ఎంతగానో ఆకట్టుకుంది. క్రికెట్ నేపథ్యంలో ఈ స్క్రిప్టు కొనసాగినప్పటికీ దానిచుట్టూ తిరిగే ఇతర పాత్రలకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది. అందుకే క్రికెట్ నేపథ్యంలో గతంలో వచ్చిన చిత్రాలకు ఇది పూర్తి భిన్నంగా, వైవిధ్యభరితంగా ఉంటుంది' అని పేర్కొన్నారు.

విడుదలకు సిద్ధమైన కార్తీ 'మెయ్యళగన్'

కార్తీ, అరవింద్ స్వామి, రాజ్‌కిరణ్, శ్రీదివ్య వంటి ప్రధాన తారాగణం నటించిన 'మెయ్యళగన్' చిత్రం ఈ నెల 27న విడుదలకానుంది. విజయ్ సేతుపతి '96' సినిమాను తెరకెక్కించిన ప్రేమ్ కుమార్ ఈ చిత్రానికి దర్శకుడు. హీరో సూర్య - జ్యోతిక దంపతులు తమ సొంత నిర్మాణ సంస్థ 2డి ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను తాజాగా రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది. తంజావూరు నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఇందులో కార్తీ పల్లెటూరి యువకుడిగా, అరవింద్ స్వామి నగరవాసిగా చూపించారు. వారిద్దరి మధ్య జరిగే ఘర్షణ, సంఘర్షణలే ఈ సినిమా కథ. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో జోరు పెంచారు.




'మెయ్యళగన్'లో కార్తీ, అరవింద్ స్వామి

78 నిమిషాలపాటు నిర్విరామంగా కర్రసాము

● ప్రపంచ రికార్డు సృష్టించిన 1200 మంది విద్యార్థులు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూరు వెలింగ్టన్ కంటోన్మెంట్ మైదానంలో జాతీయ కర్రసాము పాఠశాలల సమాఖ్య, వజ్రం క్రీడాభివృద్ధి సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో కర్రసామును ప్రోత్సహించే విధంగా ప్రపంచ రికార్డు కోసం నిర్విరామ కర్రసాము ప్రదర్శన జరిగింది. వెలింగ్టన్ కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారి వినీత్ లోటే విశిష్ట అతిథిగా పాల్గొని ఈ ప్రదర్శన ప్రారంభించారు. రాష్ట్రం నలమూలల నుంచి వచ్చిన 1200 మంది విద్యార్థులు 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జ్ఞప్తికి తెచ్చేలా 78 నిమిషాల పాటు నిర్విరామంగా కర్రసాము నిర్వహించి రాయల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నారు. ఆ సందర్భంగా కర్రసాము జరిపిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను నిర్వాహకులు బహూకరించారు.



కర్రసాము ప్రదర్శనలో విద్యార్థులు

సుశీంద్రం ఆలయంలో ఆవణి ఉత్సవాల ప్రారంభం

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా సుశీంద్రం తానుమాలయన్ స్వామివారి ఆలయంలో ఆవణి ఉత్సవాలు సోమవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో ప్రతిఏయటా మార్గళి మాసోత్సవం, చిత్తిరై తెప్పోత్సవాలు, మాసి తిరుకల్యాణోత్సవం, ఆవణి ఉత్సవాలు పది రోజులపాటు నిర్వహిస్తుంటారు. ఆ మేరకు సోమవారం ఉదయం సుశీంద్రం తానుమాలయన్‌స్వామి సన్నిధికి సమీపంలో ఉన్న తిరువేంగటవిన్నవరం సన్నిధి ఎదురుగా ధ్వజస్తంభంపై ఆలయ ప్రధానార్చకులు, వేదపండితులు ధ్వజ పతాకం ఎగురవేసి ధ్వజారోహణం నిర్వహించారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి మహా హారతి సమర్పించారు. ఈ ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ తిరువేంకటవిన్నవరం పెరుమాళ్ శ్రీదేవీ, భూదేవి సమేతుడైన వివిధ వాహనాలపై ఆశీనులపై ఆలయ వీధుల్లో ఊరేగనున్నారు. తొమ్మిదో రోజు జరిగే రథోత్సవంలో పాల్గొనేందుకు వేలాది మంది భక్తులు రానున్నారు. దేవసం బోర్డు ఈ వేడుకల ఏర్పాట్లను చేపడున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



ధ్వజారోహణం చేస్తున్న ఆలయ అర్చకులు

ఓల్వో సీఈతో నిర్మాణాల కూల్చివేత సులభతరం

● ఐడీఏ చైర్మన్ మోహన్ రామనాథన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఐడీఏ చైర్మన్ మోహన్ రామనాథన్

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎత్తయిన భవనాలను వోల్వో సీఈ పరికరంతో కూల్చటం సులభతరమని ఇండియన్ డెమోలిషన్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మోహన్ రామనాథన్ తెలిపారు. మైలాపూరు రాధాకృష్ణన్ రోడ్డులో క్లారియన్ హోటల్ ప్రెసిడెంట్ పలు అంతస్తుల భవనాన్ని అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీస్ (ఏసీటీ) సంస్థ, పీకే యూనిక్ ప్రాజెక్ట్స్ సంస్థ సహకారంతో వోల్వోస్ ఈసీ750డీయూహెచ్‌ఆర్ ఎక్సకవేటర్‌తో కూల్చివేసే పనులను చేపట్టి త్వరలో ప్రాజెక్టు ముగించనున్నట్లు ప్రాజెక్ట్ స్థలంలో ఏర్పాటైన విలేఖరుల సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ఏసీటీ సంస్థ డైరెక్టర్ సిద్ధార్థ్ రామన్, వోల్వోసీఈ, ఇండియా రీటైల్ డెవలప్‌మెంట్ హెడ్ సూరత్ మెహతా, పీకే యూనిక్ ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

కవి చక్రవర్తి కంబన్‌కు ఘననివాళి



వీఐటీ వర్శిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వంను సత్కరిస్తున్న నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 9: స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని టౌన్ హాలులో వేలూరు కంబన్ కళగం ఆధ్వర్యంలో కవి చక్రవర్తి కంబన్‌కు ఘన నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీఐటీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం హాజరయ్యారు. కంబన్ చిత్రపటాన్ని ఎస్.కుప్పుస్వామి ఆవిష్కరించారు. సోలైనాథన్ ఆహ్వానం పలికిన ఈ కార్యక్రమంలో జ్యోతి, జ్ఞానవేలు, లక్ష్మీపతి, అబ్దుల్ ఖాదర్, తిరునావుక్కరసు, సుబ్రమణి, లెక్చరర్ అన్బు, రాజేంద్రన్, బాలు తదితరులు పాల్గొన్నారు. తవశీలన్ వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.



వేలూరు జిల్లా ఆనైకట్టు తాలూకా మలైకోడి శ్రీపురం నారాయణి పీఠం తరఫున సోమవారం ఊసూరులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.5 లక్షల విలువైన టేబుల్స్, బెంచీలను పాఠశాల హెచ్‌ఎం సుధకు అప్పగిస్తున్న పీఠం వ్యవస్థాపకులు శక్తి అమ్మ

కొడైకెనాల్‌లో విద్యాశాఖ మంత్రి తనిఖీలు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో రాష్ట్ర పాఠశాల విద్యా శాఖమంత్రి అన్బిల్ మహేష్ సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మంత్రి పాఠశాలకు రావడంతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు దిగ్భ్రాంతి చెంది, వెంటనే మంత్రికి స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన పాఠశాలలోని భవనాలు, తరగతి గదులు, ప్రయోగశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మంత్రి ముచ్చటిస్తూ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగినా తాము చదివిన పాఠశాలలను, ఉపాధ్యాయులను ఎన్నటికీ మరువకూడదని తెలిపారు. ఈ పాఠశాలకు కొండపైనున్న విద్యార్థులు కాలినడకనే వస్తున్నట్లు తెలుసుకున్నానని, త్వరలోనే వారికి బస్ పాస్‌లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.



విద్యార్థికి పుస్తకాన్ని కానుకగా అందిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి

సేవకులకే సమాజంలో మంచి గుర్తింపు

● 'టామ్స్' వ్యవస్థాపకుడు డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు

ప్యారీస్, సెప్టెంబరు 9: అంకితభావంతో సేవలందించే వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకులు డా.గొల్లపల్లి ఇశ్రాయేలు అభిప్రాయపడ్డారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) శానిటరీ సూపర్‌వైజర్, టామ్స్ ప్రధాన కార్యాలయ కార్యదర్శి సీఈ తిరుమలరావు 50వ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వెప్పేరిలోని శాల్వేషన్ ఆర్మీ హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో టామ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు గొల్లపల్లి ఇశ్రాయేలు, అధ్యక్షులు నేలటూరి విజయకుమార్ సారథ్యం వహించారు. ఆహూతుల సమక్షంలో తిరుమలరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఇశ్రాయేలు మాట్లాడుతూ... కరోనా లాక్‌డౌన్ సమయంలో తిరుమలరావు తన వంతు సాయంగా ప్రజలకు కిరాణా సరుకులు, మెడికల్ కిట్లు తదితరాలు పంపిణీ చేశారని, అదే విధంగా టామ్స్ తరఫున కూడా ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ వేడుకల్లో రాష్ట్రప్రభుత్వ అదనపు కార్యదర్శి జీసీ నాగూర్, జీసీసీ సీనియర్ రెవెన్యూ ఆఫీసర్ ఎం.తిరుపాల్, అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏబీటీఎఫ్) ప్రధాన కార్యదర్శి నాయకర్ ఆర్.నందగోపాల్, బీజేకే నేత మన్నం రవిబాబు సహా టామ్స్, జనోదయం నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా తిరుమలరావును ఏబీటీఎఫ్ అధ్యక్షులు డా.సీఎంకే రెడ్డి శాలువ కప్పి ఆశీస్సులు అందజేశారు.



చెన్నై కార్పొరేషన్ అధికారి తిరుమలరావును సత్కరిస్తున్న టామ్స్ నిర్వాహకులు

మహిళా విజేతలకు పురస్కారాలు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి విజయాలు సాధించి, పలువురికి మార్గదర్శకంగా నిలిచిన మహిళలకు 'ఉయ్ వండర్ ఉమెన్' సంస్థ జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరించింది. ఈ సంస్థ 7వ ఎడిషన్ పురస్కరించుకుని ఇటీవల చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 25 మంది మహిళా మణులకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. కవితాలయ టి.కృష్ణన్, సినీ ప్రముఖులు హరిచరణ్, దీనా, ఆల్ఫ్రెడ్ జోస్ తదితరులు అతిథులుగా హాజరై మహిళలను సత్కరించారు.



పురస్కార ప్రదానోత్సవం

కృత్రిమ మేథోపరిజ్ఞానంపై అధ్యయనం కోసం

ఆమెరికాకు కమల్

● రెండు నెలలు అక్కడి నుంచే పార్టీ వ్యవహారాలు



చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మక్కల్‌నీది మయ్యం నాయకుడు కమల్‌హాసన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేథోపరిజ్ఞానం) కోర్సు చేయడానికి ఈ నెలాఖరున అమెరికా వెళ్తున్నారు. రెండు నెలలపాటు ఆయన ఆ కోర్సు అధ్యయనం చేయనున్నారు. అదే సమయంలో అమెరికా నుంచే ఆయన పార్టీ వ్యవహారాలు నడపాలని కూడా నిర్ణయించారు. ఇక ఈ నెల 21న పార్టీ సర్వసభ్యమండలి సమావేశం జరుగనుంది. ఆ సమావేశానికి మండలి సభ్యులు 1400 మంది హాజరుకానున్నారు. ఆ సమావేశంలో కమల్‌ను మళ్ళీ పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేయనున్నారు. ఈ సర్వసభ్య మండలి ముగియగానే ఆయన అమెరికా బయలుదేరి వెళ్లనున్నారు. డీఎంకే కూటమిలో కొనసాగుతున్న మక్కల్ నీదిమయ్యంకు గత లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యసభ సీటు కేటాయించేలా ఒప్పందం కుదిరింది. ఆ మేరకు వచ్చే యేడాది కమల్ హాసన్ రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కానున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఆక్సీలియం కళాశాలలో 'ముత్తమిళ్' వేడుకలు

వేలూరు, సెప్టెంబరు 9: స్థానిక కాట్పాడి గాంధీ నగర్‌లోని ఆక్సీలియమ్ మహిళా కళాశాలలో తమిళ శాఖ తరఫున ముత్తమిళ్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కళాశాల సెక్రటరీ అరుల్, సిస్టర్ మేరీ జోస్పిన్ రాణి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కమల, వలర్మతి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సినీ నేపథ్యగాయని చిత్రసేన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. తమిళ శాఖ తరఫున పవిత, ఇందుమతి, తమిళ శాఖ అధ్యక్షులు ప్రీతి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు



వేలూరు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో అభివృద్ధి పనుల శాఖ ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

ఉత్తర చెన్నైలో సాఫీగా విగ్రహాల నిమజ్జనం



బుల్లి వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న బాలురు

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక చవితి వేడుకలు అట్టహాసంగా ముగిశాయి. చవితి సందర్భంగా నగరమంతటా సుమారు 1500 భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ విగ్రహాల నిమజ్జనానికి వివిధ భక్తజన సంఘాల నిర్వాహకులు, వీహెచ్‌పీ నిర్వాహకులు తగు సన్నాహాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో తొలివిడతగా ఉత్తర చెన్నైలో మూడు ప్రాంతాల్లో సోమవారం ఉదయం వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా ప్రారంభమైంది. కాశిమేడు చేపలరేవు సమీపంలోని సముద్రతీరంలోను, ఎన్నూరు రామకృష్ణానగర్ సముద్రతీర ప్రాంతంలోను, తిరువొత్తియూరు పాపులర్ వెయ్యింగ్ మిషన్ ప్రాంతానికి చేరువగా ఉన్న సముద్రతీరంలో భారీ విగ్రహాలు, వ్యాన్లలో ఊరేగిస్తూ తీసుకెళ్ళి భక్త జన సంఘాలు నిమజ్జనం చేశాయి. కాశిమేడు చేపలరేవు సముద్రతీరం వద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భారీ క్రేన్లను ఉపయోగించారు. వినాయక విగ్రహాల ఊరేగింపులో, నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ మూడు ప్రాంతాల్లోనూ సుమారు వందకు పైగా వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. ఇదే విధంగా పట్టినంబాక్కం సముద్రతీరంలో సోమవారం ఉదయం 34 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇక ఈ నెల 14, 15 తేదీలలో అత్యధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి సుమారు రెండువేలకు పైగా పోలీసులు భద్రత కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఆ రెండు రోజుల్లోనూ భారీ క్రేన్లను ఉపయోగించి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఆ సందర్భంగా నగరం నలుమూలల నుండి వినాయక విగ్రహాల ఊరేగింపు భారీ ఏర్పాట్ల నడుమ జరుగనుంది.



తిరువొత్తియూరు సముద్రతీరంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు